**18**

# సహజాతాలు

(కథా కాలం 1983)

**మేం** చివరిసారిగా కల్సుకున్నప్పుడు వాళ్ళడిగిన మాటే పదే పదే గుర్తు కొస్తోంది. ఆ కళ్ళల్లో ఎంతటి విశ్వాసం! ఆ నాలుగు కళ్ళు నన్ను ఇంకా వెంటాడుతూనే వున్నాయి. అవి గుచ్చిగుచ్చి ప్రశ్నల వర్షాన్ని కురిపిస్తూనే ఉన్నాయి.

వాళ్ళు అడిగిన మాట నా గుండెల్లో బాకులా దిగబడిపోయి మూడేళ్ళయి పోయింది. దాన్ని తీసి అవుడే కాగితంమీద పెడితే ఇంత బాధ వుండకపోను. కొత్త అనుభవాలు పాతబాధపై దుర్మాంసంలా పెరిగి పెరిగి బాకుని కప్పేశాయి. కాని ఎటు కదిలినా గుండెల్లో గూడు కట్టుకున్న వాళ్ళ జ్ఞాపకాలు కలుక్కు మంటున్నాయి. ఈ బాధని నా గుండెల్లో ఇంకెంతోకాలం మోయలేను.

నిజానికి నేనేమీ గొప్ప కథకుణ్నికాదు. అవసరాలే నన్నో కథకుణ్ని చేశాయి. అయితే గత మూడేళ్ళుగా నేను కథలు రాయడం ఆగిపోయింది. చిన్న బాధని పెద్ద బాధ మరిపించినట్టు వాళ్ళ బాధని మరిపించింది జీవితం. అప్పుడప్పుడు ఈ చిన్న బాధా పెద్దబాధా రెండూ కలిసి ఒక్కసారిగా బాధపెడుతుంటాయి. ఈ చిన్న బాధే పెద్ద బాధకీ కారణమైంది గనక తప్పదు.

మూడు రోజులక్రితం మళ్ళీ వుత్తరం వచ్చింది. సాయంత్రం కాలేజీ నుండి తిరిగి వచ్చాక చూశానా ఉత్తరాన్ని. రాసింది వాడే, బాబు. రాజమండ్రి సెంట్రల్ జైలు నుండి రాశాడు. అందులోనూ అవే కళ్ళు. అవే చూపులు. అవే ప్రశ్నలు.

జవాబు రాయాలంటేనే భయంగా ఉంది. అవడానికి వాళ్ళిద్దరూ నా శిష్యులే. కానీ నాదికాని పరిధిలో నాకు అందని ఎత్తుల్లోకి ఎదిగిపోయారు వాళ్ళు. అందుకే వాళ్ళమాట గుర్తొచ్చినప్పుడల్లా నాకు ఏదో గిల్టీ ఫీలింగ్. ఏదో తప్పు చేశానన్న భావం వెన్నాడుతుంది.

వాళ్ళిద్దరు బాబూ, శీనూ, అప్పు చిరుకండల్లా, వాళ్ళిద్దరిదీ అదే వయసు. నేను ఆ "చిరస్మరరణ' నవల చదివి వుండకపోతే నా శిష్యుల్ని ఎన్నటికి క్షమించి

వుండేవాణ్ని కాదేమో. ఆ నవల చదివి అయిదేళ్ళయింది. ఆ పాత్రలు ఇంకా అలాగే కళ్ళముందు కదులుతున్నాయి. నా శిష్యుల ప్రస్తావన వచ్చినప్పుడల్లా అప్పూ చిరుకండళ్ళే నా కళ్ళముందు కదలాడుతుంటారు. ఇపుడు అప్పూ, చిరుకండని రూపాలు వీళ్ళిద్దరి రూపాల్లో కలిసిపోయాయి. ఇది జరిగి మూడేళ్ళయి పోయింది.

వాళ్ళిద్దరికీ, వీళ్ళిద్దరికీ అవినాభావ సంబంధంవుంది. నాకా నవల తెచ్చియిచ్చింది వాళ్ళే. దానిమీద ఏదో వాళ్ళ విద్యార్థి సంఘం లైబ్రరీ ముద్ర ఉంది. అది చూసి దాన్ని మూలకు గిరవాటేశాను.

అప్పట్లో నేను ఇలాంటి వాటికి దూరంగా ఉండేవాణ్ని. వాళ్ళ విద్యార్థి సంఘానికీ మాకూ చుక్కెదురు. అందువల్ల అలాంటివాణ్ని ఎవణ్ని నా దరిదాపుల్లోకి రానిచ్చేవాణ్నికాదు. అలాగని వీళ్ళద్దరితో అలా తెంచుకోవడం నావల్ల అయిందికాదు. దానిక్కారణం నేను కాదు. మా ఆవిడ.

వాళ్ళదీ మా ఆవిడదీ ఒకేవూరు. వాళ్ళ అక్కా చెల్లెళ్ళు మా ఆవిడకి చిన్ననాటి స్నేహితురాళ్ళు. దాంతో ఆమె వాళ్ళని అరేయ్ తొరేయ్ అని పిలిచేది. వాళ్ళ అక్కయ్యలు మా అత్తగారి పొలాల్లో కూలిపని చేసేవాళ్ళు. మా అత్తగారు మరీ ఉన్నవాళ్ళేమీకాదు. మూడువేలు మాత్రమే నాకు కట్నం యిచ్చి నిరుద్యోగిగా వున్నపుడే నాకు పెళ్ళి చేశారు.

పెళ్ళయ్యాక కొంతకాలం నేనా ఊళ్ళో ఆ అప్పర్‌ప్రైమరీ స్కూల్‌కి హెడ్‌మాస్టర్ గా పనిచేశాను. అప్పుడే వీళ్ళిద్దరూ పరిచయమయ్యారు. నా స్కూల్లో ఇలాంటి వాళ్ళు ఎందరో ఉండేవాళ్ళు. ఆ చీమిడి ముక్కులు, చిరిగిన గుడ్డల్తో వీళ్ళిద్దరూ మా ఇంటికి నిరంతరం రాకపోకలు సాగిస్తుండేవాళ్ళు. నాకు మహా చిరాకేసేది. మా ఆవిడ మాత్రం సొంత తమ్ముళ్ళలా చూసేది. పనికూడా అలాగే అధికార స్వరంతో చెప్పేది.

అత్తగారి వూళ్ళో ఉద్యోగం చేయడం నాకు ఒకందుకు లాభమే అయింది. మా బంధువర్గంలో నా పరపతి బాగా పెరిగింది. అది ఇంతా అంతా కాదు. ఇటు మూడామడా, అటు మూడామడా మా బంధువర్గంలో నాలా హెడ్ మాస్టర్ స్థాయికి వచ్చిన వారెవరూ లేరు. అదీగాక నేను అప్పుడప్పుడు కథలు కూడా రాస్తుంటాను.

అయితే ఈ లాభాల్తోపాటు కొన్ని నష్టాల్ని కూడా పంచుకోవాల్సి వచ్చింది. నా సగం స్వేచ్ఛని మా అవిడ హరించేసింది. అంతేకాదు తన స్నేహితుల్ని, బంధువుల్ని నాపై బలవంతంగా రుద్దింది. అలా వీళ్ళిద్దరూ మా ఆవిడచేత నామీద బలవంతంగా రుద్దబడ్డవాళ్ళే. ట్యూషన్ అనీ, అదనీ, ఇదనీ వీళ్ళు నాకు గుదిబండలా వేళ్ళాడేవాళ్ళు, పైపెచ్చు కులం తక్కువ వెధవలు అని మనస్సు పీకుతుండేది. నాదీ పేదకులమే అయినా హరిజనులంటేనే నాకు ఏదో తెలియని చిన్నచూపు భావం కలిగేది. ఎందుకలా అన్పించేదో తెలియదు. ఇప్పుడు ఎవర్నైనా హరిజనులని పేర్కొనడమే అమానుషంగా కన్పిస్తుంది. హరిజనులనే పేరిట డిమార్క్ చేయడమంటేనే యిపుడు వెలపరంగా ఉంటుంది.

ఆ వూరినించి నేనే బదిలీ చేయించుకున్నాను. ఆ ఊళ్ళో రైతుకూలి సంఘాల పేరిట ప్రతివాడూ ఛాతీ విరుచుకు మీద పడేసరికి నాకు మహా తిక్కరేగింది. ఈ వెధవ రాజకీయాల్లో ఎవడు వేగాలి ? రాజకీయాలు మరీ ఛండాలంగా మలుపు తిరుగుతున్నాయి. పొట్టచీరితే అక్షరంముక్క రాని వెధవ కూడా రాజకీయాలు మాట్లాడ్డమేనాయె. మింగమంటే కప్పకు కోసం. వద్దంటే పాముకు కోపం.

అన్ని పల్లెలూ అలాగే ఏడ్చినయి. ఇక నేను సమితినించి జెడ్.పి.కి బదిలీ చేయించుకున్నాను. అక్కడా పోటీ పెరిగింది. నాకున్న పరపతి మూలాలన్నిటిని కదిలించాను. ఎలాగోలా నేను కోరుకున్న తాలూకా సెంటర్ జెడ్.పి. స్కూలుకి బదిలీ అయింది.

స్కూల్ అసిస్టెంటుగా ఏ బాధ్యతా లేకుండా హాయిగానే ఉండింది. అప్పుడే ఎం.ఏ.లిట్ చేశా. అయితే అక్కడా వీళ్ళిద్దరి బాధ తప్పలేదు. సెవెంత్ పాసై సర్టిఫికేట్లు తీసుకుని తల్లి దండ్రుల్తోపాటు మా ఇంటి ముందు వాలారు. మాట ఇచ్చేదాకా కాళ్ళు వదలలేదు.

ఏ డొనేషనూ లేకుండా స్కూల్లో చేర్పించినా ఊర్కోరే! హరిజన హాస్టల్లో సీట్లు వచ్చేట్లు చూడమని ఒకటే మొర. ఇంట్లో మా ఆవిడ ఒక్తరి వుందిగా, వాళ్ళకి వంత పాడ్డానికి! అయినా నేనేం చేసేది ? అదేమైనా నాచేతుల్లో పనా ? ఆ వార్డెన్‌కి చెప్పి రెండు మూడు పరపతి చిట్టీలు కూడా అందించాను. ఓసారి ఇంటికి పిలిచి వెట్ పార్టీ కూడా ఇచ్చాను.

అయినా పెద్ద ప్రయత్నమేమీ లేకుండానే వాళ్ళకి హాస్టల్లో సీట్లొచ్చాయి. చదువు మానేయాల్సిన వాళ్ళు దాంతో చదువుకోవడం ప్రారంభించారు.

అలా వద్దనుకున్నా వాళ్ళ సంబంధం మళ్ళీ తగలబడింది. మా ఆవిడతో పాటు నా పిల్లలూ వాళ్ళ పక్షమైపోయారు. అప్పుడప్పుడు మా ఆవిడ నేను లేకుండా చాయెలు, టిఫిన్‌లు పెడ్తున్నట్టుగా కూడా తెల్సింది. అడ్మినిస్ట్రేషన్ తెలిసినవాణ్ని అవటం మూలాన ఆ విషయం అస్సలు తెలియనట్టు నటిస్తుండేవాణ్ని. అదే హద్దులో వాళ్ళుండేవాళ్లు.

పోను పోను మా ఆవిడ వాళ్ళకి సొంతక్కయిపోయింది. పిల్లలకు జలుబుచేసి అసుపత్రి కెళ్ళినా వాళ్ళే. చివరకు మా ఆవిడ అపరేషన్‌చేయించుకొని హాస్పటల్‌లో వున్నా వాళ్లే. నేను మా యూనియన్ గొడవలనీ, అదనీ యిదనీ తిరుగుతుండేవాణ్ని. వీళ్ళిద్దరూ చేదోడు వాదోడుగా వున్నారనే భరోసా నాలో ఎలా ప్రవేశించిందో తెలియదు. క్రమంగా ఇంటికి వెళ్ళడంపట్ల తొందర పూర్తిగా తగ్గిపోయింది. కొంత నిర్లక్ష్యం చేసేవాణ్ని కూడా.

అయితే వాళ్ళ ప్రపంచం వేరు. అది నాకు నచ్చేది కాదు. నా బలహీనత ఏమిటో అర్థంకాదు. కాని ఎందుకో వాళ్ళని మినహాయించి మా యింటిని ఊహించటం నాకే సాధ్యం అయేదికాదు. వాళ్ళ అప్రోచ్‌లోనే ఏదో మహాత్యం వుంది. దాన్ని ఎదిరించలేకపోయాను. లొంగిపోయాను కూడా.

అలా నాతో నా కుటుంబంతో అతుక్కుపోయారు వాళ్ళిద్దరు. వాళ్ళు ఇంటర్లో చేరినా నన్ను వదలలేదు. పైపెచ్చు నాతో ఇంకా చిన్న పిల్లల్లాగే ప్రవర్తించేవాళ్ళు. అలా ప్రవర్తిస్తే నాకెంతో ముద్దయ్యేది. నామీద నాకు కొండంత ఆత్మవిశ్వాసం పెరిగినట్టుండేది. వాళ్ళు నా కొడుకులో, తమ్ములో అనే భావం ఎలా ప్రారంభమైందో, పెరగసాగింది. నేనలాగే అధికారం చెలాయించేవాణ్ని.

పోరగాన్లు అవీ ఇవీ చిలిపిప్రశ్న లేసి నన్ను ఎంత కెలికించే వాళ్ళు ! అమాయకంగా అణకువగా కన్పిస్తూనే వెధవలు నాచే ఎన్ని పుస్తకాలు చదివించారు! వాళ్ళకా అప్రోచ్ ఎలా అబ్బిందో విచిత్రం. మా ఆవిడ తట్టుకుంటూ తట్టుకుంటూ “మాధవి’ నవల చదవడమేకాదు. నన్ను చదివేదాకా వదలలేదు.

మా ఆవిడని వాళ్ళు గెలుచుకున్నారు. ‘చిరస్మరణ’ నవల చదివేదాకా వాళ్ళు వదిల్తేగా! అమాయకాన్ని నటిస్తే మాత్రం నాకు తెలియదా! ఆ నవలలోని ఆ మేష్టారి గురించీ, ఆ కుర్రాళ్ళ గురించీ ఏదేదో చెప్పమనేవాళ్ళు. ఇక చదవక తప్పుతుందా ?

అందులో మాష్టారు పాత్రను చదువుతుంటే ఒళ్ళంతా చీమలు కుట్టినట్లుండేది. నాలా హాయిగా ఉద్యోగం చేసికోక ఇదేం పాడుజబ్బు అనిపించేది. మనం గొప్ప పనులు చెయ్యకపోయినా ఇబ్బందేమీలేదు. కానీ మనలాంటోడు గొప్పగొప్ప పనులు చేసేస్తుంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది.

ఆ నవల ముగింపు పూర్తయ్యేసరికి అర్ధరాత్రయిపోయింది. కళ్ళంట ధారాపాతంగా దుఃఖం కట్టలు తెగి ప్రవహించింది. ఒళ్ళంతా ఉక్కపోసేసినట్టయిపోయింది. ఎవరిదో పరాయి శరీరంలో నేను బతికేస్తున్నానేమో అనిపించింది. మూడురోజులదాకా నేను మళ్ళీ మామూలు మనిషిని కాలేకపోయాను.

ఆ నవల ప్రభావం నాపై యింతా అంతా కాదు. నాకు ఏంచేయాలో తోచేదికాదు. అదంతా చివరకు వీళ్ళిద్దర్నీ అభిమానించడంగా ఎదిగిందని చాలా అలస్యంగా అర్థమైంది.

ఇలా వీళ్ళిద్దరు నా వ్యక్తిగత జీవితంలో ఎన్నో మార్పులు తెచ్చారు. అయితే నా సాంఘిక జీవితంలోనూ ఇట్లా మార్పులు తెస్తారని నేను కలలో కూడా ఊహించలేదు. వీళ్ళిద్దరి కథ నన్ను అంతమందికి ఎందుకు దూరం చేయాలో నాకు అంతుపట్టని విషయం.

❄ ❄ ❄

ఇది మూడేళ్ళ క్రితంనాటిమాట. అప్పటికి వూరూరా రైతుకూలి సంఘాల్తో పాటు పోలీసు క్యాంపులు వెలిశాయి. మిలిటెంట్ యువకులకై వేట నిత్యకృత్యమై పోయింది. దొరకని వాళ్ళ తల్లి దండ్రుల్ని అరెస్టుచేసి చిత్రహింసలు పెడుతున్నారు. వాళ్ళ కోతకొచ్చిన పొలాల్ని, పెరళ్ళని పోలీసులు బలవంతంగా పశువుల్ని తోలి మేపుతున్నారు. అప్పటికి తెలుగుదేశం అధికారంలోకొచ్చి ఏడాదైనా పూర్తికాలేదు.

అప్పుడు వాళ్ళిద్దరూ కరీంనగర్‌లో డిగ్రీ చేస్తున్నారు. ఒకనాటి అర్ధరాత్రి పొద్దుపోయాక నడిరోడ్డుమీద బాబుని అరెస్టు చేశారు. శీను తప్పించుకు పారిపోయాడు.

వాళ్ళు చేసిన నేరమేమిటో తెలియదు. అర్ధరాత్రి పొద్దుపోయాక రోడ్డు మీద కన్పించడమే నేరమేమో. పోలీసులు ఎలా వచ్చారో తెలియదు. అకస్మాత్తుగా మీద పడ్డారు. బాబుకి సమయం చిక్కినట్టులేదు. చేతికి చిక్కిపోయాడు.

అరెస్టుచేసింది కరీంనగర్‌లోనే. కానీ ఎందుకో యిప్పటికి మూడు స్టేషన్లు తిప్పారు. మూడు రోజుల క్రితమే హుజురాబాద్ పోలీస్‌స్టేషన్‌కి తీసికొచ్చారు. అది తెలిసి వాడి తల్లిదండ్రులు స్టేషన్‌కు వెళ్ళారట. వాళ్ళని తన్ని తగలేసి "జమ్మికుంట' లాకప్పులో పడేశారట.

అప్పటికి బాబుని అరెస్టుచేసి పదిరోజులై పోయింది. జంతువునైనా అలా చిత్రహింసలు పెట్టరనుకుంటాను. వాడికి బతకడంపై ఆశ పూర్తిగా చచ్చిపోయింది. అయినా ఎందుకో పోలీసులు వాణ్నింకా చావనీయడంలేదు.

❄ ❄ ❄

అలా లాకప్పులో బాధగా మూలుగుతున్నాడు బాబు. ఉండి ఉండి, ఎక్కిళ్ళు వినిపిస్తున్నాయి. ఎవరో పక్కవాళ్ళు గొణుగుతున్నారు. ఆ లాకప్పులో నాపరాళ్ళపై అయిదుగురు కాళ్ళు చాపుకునీ, కాళ్ళు ముడుచుకునీ ఒరిగిపోయారు. ఎదుటి గదిలో మరో నలుగురు బాధగా మూలుగుతున్నారు.

రాత్రి పదకొండు గంటలు కొట్టాడు సెంట్రీ. ఆ ధ్వని వినా స్టేషన్ నిశ్శబ్దంగా ఉంది. గోడ గడియారం టక్ టక్‌మని విన్పిస్తోంది. ఉండి ఉండి వైర్లెస్ ఒక్కసారిగా అరుస్తోంది. గాలి స్థంభించింది. బాగా ఉక్క పోస్తోంది. లాకప్పులో ఉక్కతోపాటు సిగరెట్ పొగలా మూత్రం వాసన కమ్ముకుంది. ఆ వాసన వరండాలోకి విసిరి విసిరి కొడుతోంది. ఆ వాసనకు వాళ్ళు అలవడిపోయినట్టున్నారు. ఉండి ఉండి మూలుగులు పెరుగుతున్నాయి.

"ఆ జోలికెందుకు పోవాలె? గివన్ని అప్పుడెరుకలేదా?"

అది సెంట్రి గొంతు, ఆ గొంతులో ఆగ్రహంలేదు. అనునయం లేదు. ఏదో రొటిన్ వ్యవహారానికి విసిగిపోయిన గొంతది.

అయినా ఆ మూలుగులు ఆగిపోలేదు. వాళ్ళకు తెలుసు. ఈ బాధ ఎప్పుడో ఒకప్పుడు తప్పదని. కానీ దేహాలు ఆ బాధని తట్టుకోలేక గిల గిల లాడుతున్నాయి.

అలా ఎంత సమయం గడిచిందో తెలియదు. అది అర్ధరాత్రో అపరాత్రో తెలియదు. వైర్లెస్ మూలుగూ, గడియారం టక్ టక్ విన్పిస్తూనే వుంది. అకస్మాత్తుగా

దాన్ని మించిన శబ్దం దగ్గరవుతోంది. అది జీపు వస్తున్న శబ్దం. ఆ శబ్దం వాళ్ళకి పీడకలలా వుంది.

మూలుగుతున్న వాళ్ళ గుండెలవిసి పోయాయి. సెంట్రీ అలర్టయి పోయాడు. డి.ఎస్.పి అజ్ఞ జారీ చేశాడు. బాబుని బయటకు తీసి జీపులో తోశాడు. డి.ఎస్.పి తో పాటు యిద్దరు ఎస్సైలూ ఒక సర్కిలూ బయల్దేరారు. ఆ వెనకే రెండు వ్యాన్‌ల నిండా పోలీసులు.

జీపు స్పీడందుకుంది. ఆ కుదుపులకి బాధగా మూలిగాడు బాబు. వాళ్ళు స్పందించినట్టులేదు. జీపు సడెన్‌గా రైట్ కేసి తిరిగింది. ఆ కుదుపుకి తలకిందులవబోయి నిలదొక్కుకుంది. రోడ్డు బావులేదేమో! స్పీడు తగ్గింది. నలభై నిమిషాలు సాగి జీపు అగిపోయింది.

"ఇక్కడ్నేనా ?", డిఎస్పీ ఖంగున ప్రశ్నించాడు బాబుని.

"ఔన్సర్"

ఆ వెనకే రెండు వ్యాన్‌లొచ్చి ఆగాయి. ఎనభైమంది పోలీసులు ఆయుధాల్తో అలర్టయిపోయారు. బాబు వెంట డిఎస్పీ నడిచాడు. నాలుగు బ్యాచ్‌లుగా విడిపోయారు. ఎనభైమంది వాళ్ళని అనుసరించారు. ఏదో తాకి బోర్లా పడిపోయి మూలిగాడు బాబు.

"ఏమైందిర ?"

"కాళ్ళకు పుండ్లయినై నడువస్తలేదు సార్."

ఓ పోలీసుని ఆసరాగా యిచ్చాడు డిఎస్పీ. అతని భుజాన్ని గట్టిగా పట్టుకున్నాడు బాబు. చేతులు కూడా బాధతో సలుపుతున్నాయి. కొంత దూరాన మళ్ళీ పడబోయి డిఎస్పీపై చెయ్యివేశాడు. కాళ్ళకు గులకరాళ్లు ఒరుసుకు పోతున్నాయి. సందులేకుండా పడిన లాఠీ దెబ్బలు, చిత్రహింసలు బాగా సలుపుతున్నాయి. నరాలు కండరాలు కదిలి నప్పుడల్లా పోట్లెక్కుతున్నాయి. బాబు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి, మనస్సు పరి పరి విధాల పోతుంది. ఆ క్షణంలో ఉన్న పళంగా ప్రాణంపోతే ఎంతో హాయి అన్పిస్తోంది. అంతలోనే ఏదో ధైర్యం గుండెల్లోకి ప్రవేశిస్తోంది. అది కొంత సేపటికి గొంతులోకి ఎగదన్నింది. అంత బాధలోనూ అకస్మాత్తుగా అరిచాడు బాబు.

"వచ్చింది సార్."

ఆ ఆరుపుకి డిఎస్పీ వెన్నుపూస ఎందుకో ఒక్కసారిగా వణికిపోయింది. ఒళ్ళంతా జలదరించింది, కళ్ళు చికిలించి చూశాడు. చూట్టూ చీకటి. వీడు యింత అకస్మాత్తుగా చెప్పడం ఏమిటి? పుసుక్కున ఆ చంద్రడు చీకట్లో యిటుకేసి కాల్చినా దిక్కులేదు. అందరికీ అర్డరిచ్చాడు డిఎస్పి. నాలుగు బృందాలుగా నాలుగు వైపులకి విడిపోయారు.

అది కొండ, వాళ్ళు పాకుతూ లేయింగు పొజిషన్లో కొండ ఎక్కుతున్నారు. ఆ ఉదయం వర్షంపడినట్టుంది. కొండమీద కొంత పచ్చి పచ్చిగా వుంది. అక్కడక్కడా కాళ్ళు దిగబడి పోతున్నాయి. రాళ్ళ సందులో యిరుక్కు పోతున్నాయి. అలా పావుగంట గడిచిపోయింది. ఏదో రాయి దొర్లిన ధ్వని. డిఎస్పీ అలర్టయి పోయాడు. ఆ కలవరపాటులో చీకట్లో ఏదో ముళ్ళ కంపకి నొసలు గీరుకు పోయింది. లోలోపల ఏదోగా వుంది.

"అరేయి బాబూ"

"సార్"

"మీ చంద్రన్న ఎట్లుంటడురా ?"

"మాంచిగ వుంటడు సార్"

"మంచిగంటే?"

బాబుకి కొంత ధైర్యం చిక్కింది. రక్తంకారుతున్న పెదవులు మండుతున్నాయి. పక్కులు కట్టిన గాయాలు మాట్లాడనీయడంలేదు. పది రోజులుగా నిత్యం చిత్రహింసల్తో శరీరం అధీనంలో లేకుండా పోయింది. బాధగామూలిగాడు. అయినా కూడదీసుకుని బిగ్గరగా చెప్పే ప్రయత్నం చేశాడు.

"ఓ! యింతింత మీసాలు. తలకాయైతే మీకన్న డబలుంటది. కండలు తిరిగి పహిల్వాన్ తీరుంటడు. మీకన్న పొడవుంటడు సార్."

"కంక బద్ద తీరు సన్నగా వుంటడని అందరంటే నువ్వుగిట్ల జెప్తవెంర?"

"అది ఏనాటి ముచ్చట సార్ ? ఇపుడు మీ అసొంటోల్లలను చెయ్యి వట్టి ఒక్క గుంజుడు గుంజితే మూడు తిర్గులు తిర్గాలె. అసలు ఆకారం జూస్తెనే వుచ్చురాల్తది."

డిఎస్‌పికి పొత్తి కడుపులో ఏదో పాకినట్టయింది.

"ఛట్ లంజకొడక ! నోర్ముయి"

అంత బాధలో విరాగులైనా నవ్వలేరేమో. బాబు తనలో తాను నవ్వుకున్నాడు. దాంతో ఒళ్లు నొప్పులు కొంచెం తగ్గినట్టనిపించింది.

మబ్బులు కమ్ముకుంటున్నాయి. చుక్కలు మాయమయ్యాయి. మరింత చిమ్మ చీకటైపోయింది. ఈదరగాలి జివ్వుమని వీస్తోంది. పగిలిన పుండ్లని చలిగాలి రంపంలా కోస్తోంది. ఆ గాలికి వర్షమే వస్తుందో మబ్బులే చెదిరి పోతాయో.

డిఎస్పి మోకాలికి ఏదో చల్లగా తాకి ఉలిక్కిపడ్డాడు. ఏదో పడుకున్న పాముపై మెత్తగా అన్చినట్టుగా వుంది. వెనక్కి తగ్గాడు. పక్కనున్న పోలీసు రైఫిల్ బట్‌తో కసాపిసా పొడిచాడు. మెత్తగా నానిన మట్టితప్ప అక్కడేమీలేదు.

"ఇంకా ఎంత దూరంర ?"

"ఇంకా మీదికి సార్"

అకస్మాత్తుగా డిఎస్పి బొంగురు గొంతుతో 'అమ్మో' అని అరిచాడు. బాబు నడవలేక కూలబడిపోయాడు. ఎలాగోలా నిలబడే ప్రయత్నం చేశాడు.

"ఏమైంది సార్ ?

"లంజ కొడుక, మీరు జెయ్యవట్టి మాకు ఎన్ని తిప్పలుర ? ఏదో బండకు మోకాలిచిప్ప గుచ్చుకున్నది."

అలాపాకుతూ వెళ్తున్నారు. వాళ్ళ కాళ్ళ అలికిడే తప్ప వాళ్ళ అకారాలు కన్పించడం లేదు. మూడు పక్కల్నించి కొండని చుట్టు కొస్తున్నారు. అలా గంట గడిచింది. బలంగా వీస్తున్న ఈదురు గాలికి చర్మం బిర్రబిగుస్తోంది. బాబుకు మానని గాయాల్ని ఈగలు కొరుకుతున్నట్టుగా వుంది. పరపరా గోకాలనిపిస్తోంది.

ఆకాశంలో మబ్బులు కదిలి పోయాయి. చుక్కల వెలుగు డిఎస్పి ఆశలా మళ్ళీ మినుకు మినుకు మంటోంది. కొండఎక్కి అటూ యిటూ పరికించాడు డిఎస్పి. ఆ కొండ పక్కన మరో కొండవుంది. ఆ కొండకి కుడి పక్కన దూరాన యాభై అరవై కొడిగట్టిన కాగడాల వెలుగులా కన్పిస్తుంది. డిఎస్పి అదిరిపోయాడు. ఎందుకో మిగిలిన మూడువైపులా చూశాడు. మరోవైపు అలాగే కన్పించాయి.

అంతా నిశ్శబ్దమై పోయింది. గాలి వీస్తున్న చప్పుడు తప్ప ఏమీ విన్పించడం లేదు.

ఎవరో బహుశా సర్కిల్, సిగరెట్‌కై దూరాన అగ్గిపుల్లగీకారు. డిఎస్పి 'ష్' అనడంతో ఆ రెండూ ఆరిపోయాయి. బాబుని దాదాపు వీపుమీదమోస్తున్నాడు పోలీసు. అకస్మాత్తుగా బాబుని వదిలేసి రైఫిల్ సరిచేసికొన్నాడు. బాధగా మట్టిలో కూలబడి పోయాడు బాబు. కాలిగోళ్ళు, అరిపాదాలు చిట్లిరక్తం కారుతున్నాయి. 'అమ్మో' అని అరిచాడు. పోలీసు మోచేత్తో ఫెడీఫెడీన వీపు మీద గుద్దాడు. కనుగుడ్లనీళ్ళు కళ్ళల్లోనే దాచుకున్నాడు బాబు. దుఃఖం ఎగసి ఎగసి ఎగదన్నింది. అతి కష్టంమీద నిలవరించాడు. అంతలో 'బాప్‌రే' అంటూ అల్లంత దూరాన డిఎస్పి గొంతు విన్పించింది. పాకుతూ అటుకేసి వెళ్ళాడు బాబు. "ఏంది సార్ ! ఏమైంది!" అంటూ చుట్టూ చూశాడు.

"ఏమైందంటవెంర అదిగోచూడు. మీ వోళ్ళు ఎన్ని కాగడాలు తీసుకొని దాడికి వస్తున్నారో చూడు. వాల్లు మొత్తం ఎంత మంది వున్నరంటవ్‌ర?"

"తెలువది సార్, పల్లెకో యాభై జమైనా ఓ అయిదు వందలుండరా సార్"

"అయిదు వందలా ? మీ చంద్రన్న దగ్గర ఎలాంటి తుపాకి వుందిర ?"

"అది తుపాకంటె తుపాకి గాదు సార్ పటటట అంటూ మోగితే దాని ముందు ఎవలు నిలువరు సార్. హిందీ సిన్మాలల్ల బార్డరుమీద కాలుస్తరు చూడ్రని. గట్లుంటది సార్"

"స్టెన్‌గన్"

"కావచ్చు సార్"

ఆ నిశ్శబ్దంలో పెద్ద ధ్వని విన్పించింది. ఎవరో రైఫిల్‌తోనహా రాళ్ళపై కొట్టుకుంటూ కిందికి పడి దొర్లినట్టున్నారు. 'యాఅల్లా' అన్న ఆర్తనాదం విన్పించింది. డిఎస్పి అతృతగా అరిచాడు.

"ఏదో తట్టుకుని పడ్డట్టున్నడు సార్"

"నిన్నెవడడిగిండుర ? నోర్మూసుకో"

అలా మరో గంట గడిచింది.

"బాబుగా! ఏం మాట్లాడవేంర ?"

"నోరుమూసుకొమ్మంటిరి గదసార్"

"అటూజూడు కాగడాలన్నీ కదుల్తలేవు. కొన్నే కదుల్తున్నె. అవిచేన్ల కావలికి మంచె కాడ పెట్టుకున్న లాంతర్ల తీరున్నె గదర ?"

"చూస్తుంటే గట్లనే అన్పిస్తంది సార్"

"మరి యిదువరదాకా కాగడాలంటివి గదర"

"నాకేమెరుక ? మీరంటే నేను కావచ్చునుకున్న."

వాళ్ళు మరో కొండ ఎక్కారు. అంతటా గాలిస్తున్నారు. అందరికీ గాయాలవు తున్నాయి. ప్రయోజనం ఉంటుందన్న ఆశ సన్నగిల్లుతోంది. డిఎస్పి రేడియం వాచీ చూసుకున్నాడు. ఉదయం నాలుగు కావస్తోంది. తాగిందంతా దిగిపోయి చాలా సేపయి పోయింది. చలి కోస్తోంది. మహా తిక్కగా వుంది. బాబుని సమీపించాడు. తాబేలంత మందం వున్న అరిచేత్తో మూతి పగల గొట్టాడు.

"లంజ కొడుక. ఏడిరా చంద్రన్న ?"

దిమ్మదిరిగి మట్టిని కరుచుకున్నాడు బాబు. చెవిగూబలు పగిలినట్టున్నాయి. బొంయిమని శబ్దం విన్పిస్తోంది. నోట్లో రక్తం ఊరింది. ఉమ్మేయ బోయాడు. శక్తిచాలలేదు. తీగలు సాగిన ఉమ్మి బనీనుమీదే పడింది. మళ్ళీ మళ్ళీ వేశాడు డిఎస్పి. గొంతు పగిలిపోయేంతగా వెక్కిల్లు వస్తున్నాయి. వెక్కుతూనే నోరుతెరిచాడు బాబు.

"మీరుగింత గనం వెతుకుతుంటె దొరకనిది నాకెట్ల దొరుకుతదు ?"

"నీకు ఈ కొండల్లనే కల్సిండంటివి. స్థావరం ఉందంటివి. అసలు ఆఖరుసారి నీకు ఈ కొండల్ల ఎపుడు కల్సిందుర ?"

"రెండేండ్ల కింద సార్"

బూటుకాలు బాబు డొక్కలో దిగబడింది, 'అమ్మో' అంటూ గిలగిల కొట్టుకున్నాడు. ఏదో రాయికి తల కొట్టుకుంది. అంతా చీకటి.

"ఛట్ లంజకొడుక. ఇంతకు ముందు ఏమన్నవుర ? పది రోజుల కింద కల్సిండంటివి గదర. ఇపుడేమో గిట్లంటన్న వేందిర ? నిజం చెప్పు లంజ కొడుక"

ఆ దెబ్బలకి బాబు కళ్ళు బైర్లు కమ్మాయి. మగతలోకి జారుతున్నట్టుగావుంది. ఒళ్ళు చల్లబడుతోంది. కలలోలా ఎక్కడికో తేలిపోతున్నట్టుగా వుంది. తనపని అయిపోతోంది. మగతలోకి జారితే యిక బతకటం కల్ల. స్పృహ నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నాడు. గతాన్ని నెమరువేసుకుంటున్నాడు. అయినా గతం కళ్ళముందు కొద్దికొద్దిగా లీలగా మాత్రమే కదులుతోంది.

స్కూలు, కాలేజీ, హాస్టలు, స్టూడెంట్సు యూనియను, వాల్ రైటింగ్, కరపత్రాలు పంచడం, ఊరేగింపులు, తాలూకా సభలు, జిల్లా సభలు, రాష్ట్ర సభలు, సమ్మెలూ, సాధింపులూ, నిర్బంధాలూ, ఆరోజు, పదిరోజుల క్రితం తానూ శీనూ కలిసి లాకప్‌హత్యలకు నిరసనగా పోస్టర్లంటిస్తున్నారు. ఎలావచ్చారో తెలియదు. ఆకస్మాత్తుగా మీదపడ్డారు. శీను ఏమైపోయాడో తెలియదు. తన రూం చూపమని చిత్రహింసలు. అయిదో రోజుకి యిక భరించలేక తన రూం చూపడం. తానరెస్టయింది తెలియక ఆ పూటే తనకోసమని వచ్చి అక్కడే ఎదురు చూస్తున్న పొరుగూరి మిత్రుడు దొరకడం, ఇలా చిత్రహింసలు. తల్లీ, దండ్రీ, అక్కా, చెల్లెలూ, బావా, మేష్టారూ, ఆ అమ్మా, అందరూ వరసగా కళ్ళముందునించి కదిలి ఎక్కడికో వెళ్ళిపోతున్నారు. తాను కదలలేక అక్కడ ఒక్కడే పడిపోయాడు. లేవాలని ఆరాట పడుతున్నాడు.

అయినా ఆ హింస ఆగడం లేదు. బాబు నోరు తెరవడం లేదు. ఆ ఏడ్పుకూడా తగ్గుముఖం పడుతోంది. డిఎస్పి ఇంకా రెచ్చిపోయాడు. బాబు ప్రాణాన్ని కూడదీసుకున్నాడు. ఒక్కొక్క మాటే వెక్కుతూ పలికాడు.

“నేను ముందుగాల సరిగ్గనే చెప్పిన. మీరే బాగా కొడితిరి. కాలి గోళ్ళల్ల సూదులు పొడిస్తిరి, రోకలిబండలు ఎక్కిస్తిరి, ముడ్లెకారం పెడితిరి. అరిపాదాల మీద గోళ్ళమీద లాఠీల్తోటి కొడితిరి. పదిరోజుల కింద కలిసిండా లేదా అని నాల్గు లాఠీలు విరగ్గొడితిరి. ఇగ గీ బాధలకు తాలలేక ఔనన్న.”

“ఓరి లంజకొడకా ! కొడితే నిజం చెప్తవా అబద్ధం చెప్తవా ?”

“నిజం చెప్తెనే కొడితిరి. ఇక ఏం జెయ్యాలె. మీరన్నదే నేనన్న ఏవో కేసుల్ల ఉన్నవా అంటే ఒప్పుకోలేదా ? గట్లనే”

“అబద్దాలాడి ఎంత తిప్పలు వెడతివిర లంజకొడుక” ‘అబ్బో’ అని మోకాలు

పట్టుకుని కూలబడ్డాడు డి ఎస్పి. చీకటి. ఆ వూపులో తల ఏదో బండకు ఫట్‌మని కొట్టుకుంది. మూలుగు మరింత పెరిగింది. కొట్టేశక్తి, ఓపికా సన్నగిల్లుతోంది.

"అటాడిస్తివి గదర మమ్ములందర్ని. ట్రీట్‌మెంట్ అంటే నీకు భయం పోయిందిరా. నీకు మల్లా మంచి ట్రీట్‌మెంట్ యిస్త లంజకొడుక, నిన్ను యింతసుఖంగా చావనిస్తాన్రా? అబ్బో!" అంటూ బాధగా పళ్లు పటపట కొరికాడు డిఎస్పి.

తెలతెలవారుతోంది. మూడు పక్కల్నించి మూడు బృందాలు డిఎస్పి వద్దకు చేరాయి. ఆ కొండ పక్కనించి అల్లంత దూరాన తార్రోడ్డు నల్లగా మెరుస్తోంది. ఇంకా లైట్లార్పని వో లారీ ఆ రోడ్డంట దూసుకుపోతోంది.

"అరే! ఇది వరంగల్ సిద్దిపేటరోడ్డు తీరున్నది. అరేయి బాబుగా ! ఇవి హుస్నాబాద్ యివుతలి రత్నగిరి కొండలు గదర. జీపుల యిక్కడిదాకా యిటూ నుండి రావస్తుండె గద. పదికిలోమీటర్లు మోకాళ్ళమీద దేకిస్తివి గదర లంజకొడక"

డిఎస్పి అరుపులకి బాబుని బనియన్‌తో అమాంతంగాలేపాడు ఎస్సయి. మళ్ళీ, మళ్ళీ కొట్టాడు.

"ఏమో నాకీ తోవ తెలువది. నేను ఎట్లవచ్చిన్నో గదేతోవ మీకు జూపిన."

"లంజకొడుకా ! మీ ఊరు ఈ గుట్ట పక్కనేగదర. నీకు తెలవదార?" కసిగా డొక్కల్లో గుద్దాడు ఎస్సయి. ఎస్సయి చేతిలోని బనియన్ చిరిగిపోయింది. అంతగా బాధతో మెలితిరిగిపోయాడు బాబు. మళ్ళీ మట్టిలో కూలబడిపోయాడు.

జీపులు వ్యానులు పాతిక నిమిషాల్లో అలా చుట్టి తార్రోడ్డెక్కాయి. బాబు మళ్ళి జీపులోకి విసిరివేయబడ్డాడు.

ఓ గంటకి మళ్ళీ లాకప్పులో వేసినట్టుగా బాబుకి లీలగా గుర్తుంది. పూర్తిగా మగతకమ్మేసింది. లేచి చూసేసరికి సాయంత్రం అయింది. తీవ్రంగా ఆకలవుతోంది. ఆశగా అవతలి కేసి చూశాడు. అవతల ఏవో తెల్లపట్టీలు కన్పిస్తున్నాయి. అది ఆసుపత్రిలాగా వుంది. ఎస్సయిలూ, సి.ఐ., డి.ఎస్పీ., పోలీసులూ చెంపలు, కాళ్ళు, తల భుజం నిండా పట్టీల్తో తెల్లగా మెరిసిపోతున్నారు.

ఎందుకో నవ్వబోయాడు బాబు, నడుం కలుక్కుమంది. నీళ్ళకోసం చేయి చాపాడు. భుజం బరువై నరాలు జల్లుమన్నాయి. ఒళ్ళు నొప్పులు మళ్ళీ స్పృహలోకొస్తున్నాయి. నీళ్ళు తాగకుండానే మళ్ళీ మగతలోకి జారిపోయాడు.

❄ ❄ ❄

వాడు అరెస్టయినట్టుగా ఆ రోజు సాయంత్రమే నాకు తెల్సింది. అది కూడా వాడి అక్క రావడంతో తెల్సింది. ఎలా తెల్సిందో గానీ భోరున ఏడ్చింది. మా ఆవిడకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వాడి అక్క ఏడుస్తూ నా కాళ్ళమీద పడిపోయింది. ఆమె దృష్టిలో నేనో పెద్దస్థాయిగల పరిచయస్థుణ్ణి.

అన్నీ వింటుంటే నా కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. మా ఆవిడ పైకే ఏడ్చేసింది. నాకు ఏం చేయాలో తోచలేదు. పోలీసులు తలుచుకుంటే మనం ఎంత నిస్సహాయులమో నాకు మొదటిసారిగా తెల్సివచ్చింది. వాడి తల్లిదండ్రులు జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఉన్నారని తెల్సు. అందరి ముందే వాళ్ళని అరెస్టు చేశారు. బాబు హుజూరాబాద్ లాకప్పులో వున్నాడని వాడి బంధువులందరికీ తెల్సు. అరెస్టుచేసి పదిరోజులైపోయిందనీ తెల్సు. తెల్సికూడా ఏమీ చేయలేని నిస్సహాయత. చట్టం రాజ్యాంగం పౌరహక్కులు తమముందు పనిచేయవని పోలీసుల సమ్మకం. ఇవన్నీ తెల్సినా వాళ్ళు ఏమీ చేయలేరని పోలీసుల విశ్వాసం. వాళ్ళ విశ్వాసాన్ని ఎవరు వమ్ముచేయాలి ?

ఆ క్షణాన నేను పడ్డబాధ కాగితం మీద పెట్టలేను. ఆ సమయం నన్ను అగ్ని పరీక్షకు నిలబెట్టింది. పోలీసులు మనుషుల్ని ఎందుకు చంపుతారో, ఎందుకు బతకనిస్తారో నాకు అప్పుడే అర్థంకావడం మొదలైంది. ఇన్ని తెలిసీ నేను ఏమైనా చేయగలనా ? యూనియన్‌లో వుండేవాణ్ణనే పరపతివుంది. కాని యిప్పటి పరిస్థితి వేరు. నా సిద్ధాంతాల స్నేహితులంతా ఆ క్షణాన పూర్తిగా పరాయి వాళ్ళనిపించింది. ఇలాంటి భావం యింతకు ముందెన్నడూ కలగలేదు. ఆశ్చర్యం.

ఏమీ తోచలేదు. శాఖలో పనిచేసే పాత స్నేహితుడు చందర్‌రావు వద్దకు పరుగుతీశాను. ఎన్నడూ లేనిది నా లోలోపల గుటగుట మొదలైంది. అతను అడ్వకేటయివుండి ఎంతో మందిని అరెస్టు చేయించినవాడు. వాళ్ళు రోజుల తరబడి లాకప్పుల్లో అంబో అని అలతేరుతుంటే కసిగా నవ్వేవాడు.

అయితే నేను తొలుతమనిషిని. అన్నిటికన్నాముందు నేను మానవత్వాన్ని గౌరవిస్తాను. ఆ తర్వాతే సిద్ధాంతాలూ రాద్ధాంతాలూ. నా స్నేహితుల కోసం నాలోని మానవత్వాన్ని చంపుకోవాలా ? వాళ్ళని వ్యక్తులుగా పౌరులుగా గౌరవించండి. చట్ట ప్రకారం శిక్షించండి అనడం నేరమా ?

నా మాటలు విని నవ్వేశాడతను. అ నవ్వు చాలా పాతది. ఎన్నోసార్లు చూసిందే. కాని ఆ రోజు మాత్రం ఆ నవ్వుకి కొత్త అర్థం స్ఫురించింది. ఎన్నడూ లేంది అతన్ని చూస్తుంటే రోతభావం కలిగింది. మరి వుండలేకపోయాను.

మా ఆవిడ బేలగా ఏడ్చేసింది. వాళ్ళ తమ్ముడేనావాడు! వాడు నా శిష్యుడు మాత్రం కాడూ! అప్పుడు ఏదో తెగువ, ధైర్యం. మంచిపని చేస్తున్నాననే అత్మవిశ్వాసం నన్నావహించాయి. ఏదైతే అది అయిందని వాడి అక్కని వెంట తీసుకుని నేనే బయల్దేరాను. పోలీసులు ఆ గాయాలతో పట్టిలతోనే ఏమిటో హడావిడిగా వున్నారు. బాబు యిదేమీ గమనించే లోకంలో లేనట్టున్నాడు. సరిగ్గా ఆ సమయానికి వెళ్ళకపోతే బాబుని ఏం చేసేవారో తెలియదు. ఇపుడు ఆలోచిస్తే ఒళ్ళు గగుర్పొడుస్తోంది.

స్టేషన్ వాతావరణం అదోలా వుంది. లోనికి ప్రవేశించగానే ప్రాణం ఎందుకో ఒక్కసారిగా జల్లుమంది. ఏదేదో అరిచి గీపెట్టి అడగాలనుకున్నాను. కాని నోరే తెరవలేకపోయాను. గుటకలు మింగుతూ బాబుకోసం అతృతగా అటూ యిటూ చూశాను. వాడు శవంలా పడివున్నాడు. శవంకన్నా భీభత్సంగా పడివున్నాడు. శరీరం నల్లగా కమిలిపోయింది. చర్మంపై లాఠీదెబ్బలు పెద్దపులి చారల్లా అచ్చులుతేలి పుళ్ళుబడిపోయాయి. చారలమధ్య పుళ్ళు నెత్తురు కారుతున్నాయి. అట్టకడుతున్న నెత్తుటిమీద ఈగలు వాలుతున్నాయి. పెదవులమీద వాలిన ఈగలు అట్లా అతుక్కుపోయాయి. మేం వచ్చినట్టుగా వాణ్ని పక్కనున్న తను మగతలోంచి లేపుతున్నాడు. వాడిలో మాత్రం కదలికలేదు.

వాడి అక్క డిఎస్పి, సర్కిల్‌ల కాళ్ళమీద పడిపోయింది. కడుపులో పేగులు తెగివచ్చేట్లు ఏడుస్తోంది. ఏడేళ్ళ కొడుకు భయంతో తల్లితో పాటు ఏడు పందుకున్నాడు. తల్లిని వాటేసుకున్నాడు. వాళ్ళు కాళ్ళతో విదిలించారు, ఆ దృశాన్ని నేనెలా భరించానో యిప్పటికీ అర్థంకాదు. పిల్లవాడు ఎగిరి వెల్లకిలా అల్లంతదూరం పడిపోయాడు. ఆమేమో మెడకోసిన కోడిలా మూడు తిరుగులు తిరిగి పడిపోయింది.

నాలో చీమూ నెత్తురు చచ్చిపోయిందా! గొంతు పెగల్చుకుని గర్జించాలనుకున్నాను. నా మాటలు నాకే ప్రాధేయపడుతున్నట్టుగా విన్పించాయి.

వాళ్ళు కిమ్మనలేదు. వాడూ, వాడి తల్లి దండ్రులూ ఎక్కడున్నదీ వాళ్ళు నోటినుంచి చెప్పలేదు. వాడికి అక్క అయి పుట్టినందుకు మాత్రం ఆమెని రాయలేని బూతులు తిట్టారు. ఏదేదో బొంకారు, ఎంతబతిమాలినా వాడితో మాట్లాడ్డానికిగానీ, చూడ్డానికిగానీ అనుమతించలేదు.

ఆ తర్వాత మరో పది రోజులుంచుకున్నారు, ఎవర్నో హత్యచేసినట్టూ మరెవరింట్లోనో దొంగతనం చేసినట్టూ దొంగకేసులు పెట్టి కరీంనగర్ సబ్‌జైలుకు పంపారు.

సబ్‌జైలు కొంత గుడ్డిలోమెల్ల. బహుశా నెలరోజుల కనుకుంటాను. ఓరోజు ప్రత్యేకంగా లీవు పెట్టి వాణ్ని కలవడానికి వెళ్ళాను. ఆ రోజు ములాఖత్ కోసం వచ్చే బంధువుల రష్ అంతగాలేదు, తొందరగానే యింటర్వ్యూ దొరికింది. కొంచెం సావకాశంగానే వాతావరణం వుంది.

అప్పటికి వాడి పుళ్ళు తగ్గుముఖం పట్టాయి. శరీరంపై లాఠీ దెబ్బలు నల్లగా కమిలిపోయి చారలు ఏర్పడ్డాయి. చిత్రహింసల గుర్తులు స్పష్టంగా కాలి గోళ్ళమీదా వేళ్ళమీదా కన్పిస్తున్నాయి. చెంపపై నల్లని మచ్చ ఒకటి వచ్చి చేరింది. మనిషి కొంచెం చిక్కిపోయాడు. అయినా ముఖం బాగా కళ తేలింది. ఆరోగ్యం యింకా కుదుట బడినట్టులేదు. పలకరింపుగా వాడి కళ్ళలోకి వాత్సల్యంగా చూశాను. ఎంత ఆశ్చర్యం! ఆ కళ్ళల్లో ఎక్కడా దీనత్వంలేదు. అవి ఎంత స్వచ్ఛంగా నిర్మలంగా వున్నాయనీ! వాడి కళ్ళల్లో కొత్తగా ఏదో మెరుపు తళుక్కుమంటోంది. చాలా ఉత్సాహంగా వున్నాడు వాడు.

నా ఆలస్యానికి క్షమాపణలు కోరుకోవాలనుకున్నాను. నోరుపెగలలేదు. ఏదో చెప్పబోయి తలదించుకున్నాను. వాడు అంతా పసిగట్టినట్టున్నాడు. వాడి కంతా అర్థం అయిపోయినట్లుంది, ఒక సన్నని చిరునవ్వు నవ్వాడు.

నా కప్పుడే మొదటిసారిగా తోచింది-వాడు నాకన్నా ఎంతో ఎత్తు ఎదిగి పోయాడని.

వాడు మా ఆవిడగురించీ, మా పిల్లలగురించీ, అడుగుతున్నాడు. ఆశ్చర్య కరంగా వాడిగొంతు మా ప్రిన్సిపాల్ గొంతులా శాంతగంభీరమైపోయింది.

నాశిష్యుణ్ని చూడ్డానికికదూ నేను వెళ్ళింది! నా స్నేహితుణ్ని కలిసినట్టయింది. నాలో ఉపాధ్యాయుడు కరిగిపోయి వాడి శిష్యుడు పుట్టుకొచ్చినట్టయింది.

ఆ మార్పు జరిగిన క్షణాలు చాలా విచిత్రమైనవి. అవి ఎంతో మధురమైన క్షణాలు. ఎంత అవలీలగా ఈ క్రమం జరిగిపోయిందనీ! వాడు నా కళ్ళల్లోకి చూశాడు. కళ్ళతోనే ఎన్నో ప్రశ్నించాడు. నేనూ కళ్ళూ కళ్ళూ కలిపా! ధనరుణ విద్యుత్తీగలు ఒరుసుకున్నట్టుగా మెరుపులు చిమ్మాయి. షాక్ తిన్నాను. అవి సాదాచూపులు కాదు. అందులో ఎక్స్‌రే కిరణాలున్నాయి. మరి చూడలేక కళ్ళు దించుకున్నాను.

నా బలహీనతలు నాకు తెలుసు. వానికోసం స్టేషన్ కెళ్ళినందుకే నా స్నేహవర్గమంతా అనుమానంగా చూసింది. ఎ.పి.సి.ఎల్.సి. జాప లక్ష్మారెడ్డిగారిని అప్రోచ్ కావడంతో వాళ్ళతో గొలుసు నెర్రెలిచ్చింది. వాళ్ళు కాకుల్లా పొడిచారు. నేను ఎందుకో భయపడిపోయాను. అందుకే సమస్యని జాపలక్ష్మారెడ్డి గారికి బదిలీ చేసేసాను. మళ్ళీ అందులో వేలుపెట్టలేకపోయాను.

మా ఆవిడకి పరిస్థితులు యింత తలకిందులవుతాయని తెలియదు. తెలియడం మొదలైనాక మా ఆవిడ వ్యక్తిగత ప్రేమని సంఘ భయం లొంగదీసింది. ఆ మాటకొస్తే నేనూ ఈ పరిస్థితిని జీర్ణించుకోలేక పోయాను. ఏవో కొన్ని ఊహించాను గానీ మరీ యింత యిదిగా యిన్ని మార్పులొస్తాయని, యింత దూరం వెళ్తుందని తెలియదు. అది నా ఊహకందలేదు. కాని నాలో అంతర్మథనం మొదలైంది. రాత్రుళ్ళు నిద్రపట్టేదికాదు. అప్పు, చిరుకందల రూపం ఎదుటనిలిచేది. ఆ మాష్టారు నన్ను చూసి ఏదో ఒకటి తేల్చుకో అని అప్యాయంగా నవ్వుతూ భుజం మీద చెయ్యివేసినట్లయ్యేది. రోజురోజుకూ వాళ్ళు నన్ను మరింత అప్యాయంగా, మరింత సూటిగా నిలదీస్తున్నట్టనిపించేది.

ఇక భరించలేకపోయాను. ఒక నిర్ణయానికి రావడానికి అంత సమయం పట్టింది. ఇదంతా వాడికి ఏమని చెప్పను ? మా ఆవిడపట్ల వాడికున్న గౌరవభావాన్ని చెడ గొట్టడానికి నాకిష్టం లేకపోయింది. నన్ను నేను కించపరుచుకోవడానికి ఇష్టం లేకపోయింది. అందుకే నోరుపెగల్లేదు. అయినా వాడు అన్నీ గ్రహించేశాడు. అవేవీ ప్రసక్తిలోకి రాకుండా వాడు నాకన్నా హుందాగా ప్రవర్తించాడు. ఆ మాటల్లో నాగొంతు పాతటీచర్ స్థాయినించి స్నేహితుడిస్థాయికి ఎపుడు చేరిందో

నేను గమనించనేలేదు. వాడికళ్ళు యింత తీక్షణంగా ప్రశ్నల వర్షం కురిపించగలవని నేనూహించలేదు. ఇప్పటికి గుర్తు అవే చూపులు అవే ప్రశ్నలు.

గొంతు సవరించుకున్నాను. మాటమార్చాను. శీను ఎక్కడున్నాడని వాకబు చేశాను. వాడు కొంటెగా నవ్వాడు. శీను క్షేమంగా బయటే వున్నాడని అర్థమైంది. ఆ అయిదు నిమిషాల కలయిక నాలోఎన్ని మార్పులు తెచ్చిందో ఆశ్చర్యం.

❄ ❄ ❄

ఆ తర్వాత నేను మళ్ళీ జైలుకు వెళ్ళలేదు. వాడిచూపులు, అవేచూపులు, అవేప్రశ్నలు నన్ను వెంటాడుతాయని భయం వేసింది. వెళ్ళకున్నా అవి వెంటాడ్డం మానలేదు. వాడు అపుడపుడు లెటర్స్ రాస్తూనేవున్నాడు. వాణ్ని కరీంనగర్‌నించి వరంగల్‌కి, వరంగల్‌నించి రాజమండ్రికి: రాజమండ్రినించి విశాఖ జైలుకి అటూ యిటూ తిప్పారు. అయినావాడు పట్టు విడువలేదు.

వాడిపుడు రాజమండ్రి జైల్లో వుంటున్నాడు. మూడురోజుల క్రితం వచ్చిన జాబు అక్కన్నించే. వాటికి నేనెన్నడూ జవాబు రాయలేదు. వాడివల్ల ఈ మూడేళ్ళల్లో నా పరిస్థితి ఎన్ని మార్పులకు గురైందో వాడు ఊహించి ఉండడు.

శీను ఏడాదిక్రితం ఓసారి అనుకోకుండా కలిశాడు. తొలుత నేను వాణ్ని గుర్తుపట్టలేదు. వాడేపలకరించాడు. ఆశ్చర్యపోయాను. వాడి కళ్ళల్లోనూ అదేమెరుపు అవే ప్రశ్నలు. చటుక్కున అప్పు, చిరుకండలూ, ఆ మేష్టారూ గుర్తుకొచ్చారు.

ఆ తర్వాత నాకు మళ్ళీ ఎవరూ కన్పించలేదు. కానివాళ్ళ చూపులు నన్నింకా వెంటాడుతూనే వున్నాయి. వాళ్ళిచ్చే గౌరవం నన్ను బాధగా గుచ్చి గుచ్చి ప్రశ్నస్తూనే వుంది.

ఇపుడు నాకుటుంబం విచ్ఛిన్నమయ్యేస్థితిలో వుంది. ఇపుడు నా పాత స్నేహిత వర్గమంతా నన్ను శత్రువులా చూస్తోంది. నేను వాళ్ళకి చేసిన అన్యాయం ఏమీలేదు. డ్యుయల్ వాల్యూస్‌ని పాటించే పూర్వ సహచరులు గుర్తొచ్చినప్పుడల్లా ఏదో విషాదంగా వుంటుంది. వీళ్ళల్లో కొందరు నన్ను అరెస్టుచేయించి సస్పెండు చేయించాలని ఆ మధ్య రెండుసార్లు ప్రయత్నించారు. దాంతో వాళ్ళతోపాటు నేనూవున్న ఆ టీచర్స్ యూనియన్‌ని కూడా వదిలేయాల్సి వచ్చింది. మన జీవితమూ, మన యూనియన్ వేర్వేరనీ వాళ్ళు చేసిన విభజన ఎంత హాస్యాస్పద

మైందో దాంతో తెల్సివచ్చింది. దీంతో యూనియన్ వదిలేయక తప్పలేదు. ఇపుడున్న మా యూనియన్ గుండెగట్టిదికావడం వల్ల ఎవరి ఎత్తులూ పారడం లేదు.

ఇలా నా సాంఘిక జీవితమూ కుటుంబ పునాదులూ కదిలిపోయాయి. బాబుని నాకు అంటగట్టిన మా ఆవిడే తిరగబడి పోయింది. వాళ్ళని ఎంతో అభిమానించిన మా ఆవిడే ఇపుడు వాడంటే ఉలకదు. పలకదు. వాడురాసే ఉత్తరాల్ని చదవదు. నాకుతెల్సు మా ఆవిడకున్నది నిజమైన కోపం కాదనీ తల్లి కొడుకుపై అలగడం లాంటిదనీ. అయితే అందుకు తగు సమయం రావాలి.

అయితే ప్రస్తుతం ఇంట్లో పెళ్ళాంతో సహా యిలా పాతస్నేహితులెందరో దూరమైపోయారు. కొందరు తిట్టారు. కొందరు అయ్యోపాపం అన్నారు. కొందరు జీవితాన్ని పాడుచేసికోకు అన్నారు. అంతెందుకు శీనూ బాబుల్ని అంతగా అభిమానించిన మా ఆవిడ వారం క్రితం మా పెద్దవాడ్ని చావబాదింది. వాడి ప్యాంటుమీద జేగురురంగు మరకలున్నాయట. వాల్‌రైటింగుకి వెళ్ళినట్టు పసిగట్టింది.

నా పాత స్నేహితవర్గం దూరమైనందుకు నాకు బాధలేదు. వాడు అడ్వకేటు చందర్‌రావు బాబు తల్లిదండ్రుల్నించి అయిదువందలు లాగాడు. ఆ విషయం వాళ్ళయినా నాకు చెప్పలేదు. బహుశా చందర్‌రావే ఆ కట్టడిచేసి వుంటాడు. అయినా ఒక్క కేసులోనైనా బెయిల్ యిప్పించిన పాపాన పోలేదు. యింకా మళ్ళీ మళ్ళీ డబ్బులాగే ప్రయత్నం చేశాడు. వాళ్ళవద్ద తాకట్టు పెట్టడానికి కంటూ ఏమైనా మిగిలివుంటే వాళ్ళు తప్పక యిచ్చేవాళ్ళే. వాళ్ళ డబ్బుతిని, వాళ్ళ వాళ్ళని హింసించి కూడా వాడు ఘరానా పెద్దమనిషనిపించుకున్నాడు. నా పాత స్నేహితుల్లో ఎక్కువ యిలాంటివాళ్ళే. వాళ్ళపరువు తీయదలుచుకోలేదు. అది నా చేతుల్లో లేదుకూడా. ఇప్పుడు వాళ్ళే పెద్దమనుషులుగా చెలామణి అవుతున్నారు. బాబుని పట్టించుకున్నందు వల్ల నేను చైనా, రష్యా తొత్తునై పోయాను వాళ్ళ దృష్టిలో. ఏమిటి విచిత్రం ! ఎంత తలకిందుల విలువలు మన సమాజంలో గౌరవం పొందుతున్నాయో! బాబూ, శీనూ అనే దాంట్లో నిజంలేదూ!

❄ ❄ ❄

మరోసారి మరోసారి.....

పదోసారిగా ఆ ఉత్తరం చదివా. మనసంతా ఏదోలా అయిపోయింది. ఒక

పక్క దుఃఖమూ, ఒక పక్క సంతోషమూ, యింకో ప్రక్క సంభ్రమమూ ముప్పిరి గొంటున్నాయి.

ఆ ఉత్తరం కూడా రాజమండ్రి నుంచి వచ్చిందే. అయితే అది బాబు రాసింది కాదు. జైలుబయటి వాళ్ళెవరో రాశారు. ఆశ్చర్యంగా వుంది. ఆందోళనగావుంది. జరిగిందేమంటే ఈ కథ ఫేర్‌చేస్తూ ఈ రోజు యింట్లో వుండిపోయాను. పొద్దున్నించి టిఫినైనా చేయలేదు. మూడురోజుల్నించి మా ఆవిడ నాతో మాటలు మానేసింది. కనుక సరిపోయింది. కాని ఆకలి వేస్తోంది. అయినా ముగింపుకోసం పట్టుదలగా కూర్చున్నాను. అంతలో 'పోస్టు' అన్నకేక వినబడింది. గిరాటేసిన ఆకార్డు నా కాళ్ళవద్ద చేరింది, అతృతగా చదివాను. అది బాబు గురించి వ్రాసింది.

జైళ్ళల్లో ఖైదీలకు కనీస సౌకర్యాలు యివ్వాలనీ, మాన్యువల్‌ను అమలు చెయ్యాలనీ, కేసు వాయిదాలకు కోర్టులకి తీసుకెళ్లాలనీ, అండర్ ట్రయల్స్‌ని పౌరుల్లానే చూడాలనీ జైల్లో సమ్మెచేశారట. మరో యిద్దర్తోపాటు బాబు పది రోజులుగా నిరాహారదీక్షలో ఉన్నాడట. వార్డెన్‌లు, గార్డులు లాఠీచార్జీ చేశారట. వాడు బాబు మరో అతనూ స్పృహతప్పిపడిపోతే హాస్పటల్‌లో చేర్పించారట. ఇంటెన్సివ్ కేర్‌లో వుంచారట.

నా మనస్సెందుకో కీడు శంకించింది. అన్ని చిత్రహింసల పాలైనవాడికి దెబ్బ నొప్పులులేస్తే యిక బతకడం కష్టం అని విన్నాను. వాడి రూపం స్థానంలో మా పెద్దోడిరూపం మనక మనగ్గా కన్పిస్తోంది. ఎందుకో తెలియదు నాకాళ్ళువణుకుతున్నాయి. ఎందుకో నా కలం కూడా వణుకుతోంది. ఇపుడు నా చుట్టూ సముద్ర మంత నిర్బంధం పేరుకుపోతోంది పంతోషంలోనైనా దుఃఖంలోనైనా పంచుకోవడానికి తోడు లేకుండాపోయేస్థితి ఎంత దయనీయమైనదీ! ఇంట్లోవున్న ఒక్కర్తీ మూగ నోము పట్టిందాయె. నాపై ఆలిగిన మా ఆవిడని సమీపించాను. వణుకుతున్న గొంతుతో పలకరించాను. ఏమిటన్నట్టుగా చూసింది. బతిమాలాను. పలకరించాను. చివరకు ఎలాగైతేనేం ఆ ఉత్తరాన్ని చదివి వినిపించాను.

ఆ ఉత్తరాన్ని చేతిలోంచి లాక్కుంది. తాను కూడాబలుక్కుని చదివింది. ఒకటే ఏడుపు. ఏమిటో ఈ ద్వంద్వం. అదర్శాలకూ ప్రేమలకూ జీవితాలకీ మధ్య ఓ చెలగాటం. కాని వాడు మాత్రం చావుతోకూడా ట్రీట్‌మెంటు యివ్వగల

సమర్ధుడని తెల్సిపోయింది. వాడిని బతికించు కోవాలి. ఎన్నికష్టాల్లోనైనా వాడు తన వ్యక్తితాన్ని నిలబెట్టుకున్నాడు. చిన్నచిన్న తప్పుల్ని సవరించుకుంటూ వ్యక్తిత్వాన్ని ఎదిగించు కోవడం చిన్నవిషయమేమీ కాదు. ఈ వ్యక్తిత్వమే వాన్ని మిత్రులు అభిమానించడానికి, వాళ్ళ శత్రువులు అంతగా భయపడ్డానికి కారణం. వాడి జీవితమే వాన్ని తీర్చిదిద్దింది.

ఏదో, ఏదేదో నాకు తెలియని దేదో జరుగుతోంది. వాడిని బతికించుకోవాలి. వాడి తల్లి దండ్రుల్ని తీసుకుని వెంటనే రాజమండ్రికి వెళ్ళాలి. వాడు చూసే చూపుల వెనకగల ప్రశ్నలకి జవాబు యివ్వాలి. బయల్దేరమని మా ఆవిడ ఒకటే తొందర పెడుతోంది. పెద్దాడ్ని పిలిచి "వద్దన్నా పోతున్నావ్‌కదరా! అదేదో పోస్టర్లు యియ్యాల్ల వెయ్యారాదురా" అంది.

ఇవాళ నాకు ప్రపంచాన్ని జయించినంత గర్వంగావుంది. ప్రపంచాన్ని జయించడం అంటే మనిషి తన్నుతాను జయించడమేనని నిజంగా నాకివ్వాల్టి వరకూ తెలియదు. గబగబ వీధిలోకి వచ్చి బస్సుస్టేషన్ దారిపట్టాను.

ఇపుడు నాకేం భయంలేదు. మూడేళ్ళుగా వెంటాడుతున్న వాడి చూపులకి యిప్పుడు నేను జవాబు చెప్పగలను. వాడికళ్ళలో కళ్ళు కలపగలను. వాళ్ళ ప్రశ్నలు యికనన్ను బెదిరించవు.

కాకూడనిది జరిగితే వాళ్ళ ప్రయాణాన్ని నేను కొనసాగిస్తాను. వాళ్ళు కోరుకున్న మాష్టార్లా ఎదుగుతాను. కాదు కాదు. నేనూ వాళ్ళతో నడుస్తాను.

కొండంత ఆశ. లోయంత దిగులు. వాడు బతుకుతాడు. ఎలా చెప్పగల నంటే 'చిరుకండడూ, అప్పూ' చిరంజీవులు కదా !

**రచనా కాలం 1986. – సమీక్ష మాసపత్రిక, 1986**

అన్యాయాలను వ్యతిరేకిస్తూ ఉద్యమించడం మనిషి సహజ స్వభావమని చెప్పిన కథ 'సహజాతాలు'. సామాజిక జీవితంలో జరిగిన సంఘటనలను కూర్చి వ్రాసిన కథే 'సహజాతాలు'. ఉత్తమ పురుషలో సాగే కథ ఇది. ఈ కథ విప్లవ ఉద్యమాల కాలంలోని సామాజిక పరిణామాలను రికార్డ్ చేసింది. విప్లవ విద్యార్థుల ద్వారా ఉపాధ్యాయులు, లెక్చరర్లు కూడా ప్రభావితమైన క్రమాన్ని ఈ కథ తెలుపుతుంది. బాబు, శ్రీనులు అత్తగారి ఊళ్లో అతను అప్పర్ ప్రైమరీ స్కూల్‌కు హెడ్మాస్టర్‌గా పని చేస్తున్నప్పుడు పరిచయమవుతరు. అతని భార్యకు బాబూ, శ్రీను వాళ్ల అక్కలు బాల్య స్నేహితులు కావడంతో ఇంటికి రాకపోకలు సాగించేవాళ్ళు.

తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన తర్వాత ఊరూరా పోలీసు క్యాంపులు వెలిసినై. మిలిటెంట్ యువకుల కోసం పోలీసులు గాలిస్తున్న రోజులవి. కరీంనగర్‌లో డిగ్రీ చేస్తూ బాబూ, శ్రీనులు లాకప్ హత్యలకు నిరసనగా అర్ధరాత్రి వాల్‌పోస్టర్లు వేస్తున్న సమయంలో అకస్మాత్తుగా పోలీసులు వచ్చి మీదపడ్డరు. బాబు పోలీసులకు చిక్కిపోయిండు. శ్రీను తప్పించుకుని పారిపోయిండు.

బి.ఎస్. రాములు కథలు చారిత్రక భౌతికవాదం వెలుగులో సామాజిక చరిత్రను విశ్లేషించి అందిస్తయి. సామాజిక పరిణామాలు, జీవితం అందుకు ప్రాతిపదికగ ఉంటయి. వీరి అన్ని కథల్లోనూ అంతస్సూత్రం ఇదే. వెనకటి కాలం కన్నా నేటి కాలమే బాగుంది. రేపటి కాలం ఇంకా బాగుంటది అని చెప్పడమే చారిత్రక పరిణామం. వీటిని జీవితం పునాదిగా విశ్లేషించడమే వీరి కథల్లోని బలం. అందుకే వీరి కథలకు చారిత్రక ప్రాధాన్యత ఏర్పడింది. వీరి కథలు వర్తమాన సామాజిక చలన సూత్రాలను తెలుపుతై. సామాజిక చలనం ఎలా వుందో తెలుసుకొని సూత్రీకరించి చెప్పడమే సామాజిక చలన సూత్రాలు. అందుకు బి.ఎస్. రాములు జీవితాన్ని ప్రాథమికం చేసుకొని కథా ప్రక్రియను అందుకు వాహికగా మలుచుకున్నరు. అందువలన వీరి కథలు రూపంలో కథలు. సారంలో సామాజిక చలన సూత్రాలను విప్పి చెప్పే చారిత్రక భౌతికవాదం.

**– డా. కర్రె సదాశివ్** ('తెలంగాణ సామాజిక పరిణామాల్ని చిత్రించిన బి.ఎస్. రాములు కథలు – ఒక పరిశీలన' ఎంఫిల్ నుంచి)